RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి** 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 158 | జులై 09 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| Nizamabad | Vol: 03 | Vol: 158 | July 09 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


### పశ్చిమాసియాలో మరోసారి

# రాజుకున్న అగ్గి

### అమెరికా, ఇరాన్ దేశాల మధ్య పరస్పర దాడులు



**టెహ్రాన్ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చోటుచేసుకున్న పరస్పర దాడులతో గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా తాము ఇరాన్ మిలిటరీ స్థావరాలపై విరుచుకుపడినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అంతర్జాతీయ జలమార్గాల్లో పౌర నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా ఈ చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా టెహ్రాన్ కమాండ్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని అమెరికా వెల్లడించింది. ఈ దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కి

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రజలను తప్పు దోవపట్టించేలా కేంద్రం

### బొగ్గు గనుల ప్రకటనను ఖండించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్ జనసంఘర్షణ**
సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేస్తున్న ప్రకటనలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించినట్లు కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేంద్రం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. తాడిచెర్ల–2 కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 సెప్టెంబర్ 16న, ఆనాటి యూపీఏ ప్రభుత్వ హయాంలోనే సింగరేణికి అధికారికంగా కేటాయించిందని ఆయన స్పష్టం చేశారు. ఎంఎమ్‌డీఆర్ చట్టం రాకముందే ఈ కేటాయింపులు జరిగాయని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ఉండే బొగ్గు గనులలో కేవలం

➤ మిగతా 2వ పేజిలో..

# 'కుచ్ కుచ్ హోతా హై'

### ఇండోనేషియాలో ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు



**జకార్త జనసంఘర్షణ**
భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనలో బాలీవుడ్ క్లాసిక్ మూవీ 'కుచ్ కుచ్ హోతా హై' గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. జకార్తాలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. ఇండోనేషియాలో భారతీయ సంస్కృతికి, ముఖ్యంగా హిందీ సినిమాలకు ఉన్న ఆదరణను గుర్తుచేశారు. అక్కడ 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా టైటిల్ సాంగ్ ఎంతో ప్రాచుర్యం పొందిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత్–ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలపై చమత్కరిస్తూ..

➤ మిగతా 2వ పేజిలో..

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఫలితాలు ఏకపక్షమే

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**గద్వాల జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఫలితం ఏకపక్షంగానే ఉంటుందని, మళ్లీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని, అదే సమయంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి తమ పూర్తి దీవెనలు అందించారని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు (వాకిటి శ్రీహరి స్థానంలో), స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపి, వారికి ఆత్మీయ చిరుకానుకలను అందజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు పత్రాలను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, గద్వాల జిల్లా ప్రజలు తమపై చూపించిన అభిమానం మరువలేనిదని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్లు పేదల ఆత్మగౌరవానికి చిహ్నాలని, దశాబ్దాలుగా పేద ప్రజలు కంటున్న సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని స్పష్టం చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా కేవలం పేదరికాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టించాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జూరాల, నెట్టంపాడు ప్రాజెక్టుల ముంపునకు గురైన భూనిర్వాసితులకు

# తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
భారతదేశంలో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ (ఖలీఫత్) స్థాపించాలనే కుట్రలపై జాతీయ దర్యాప్తు సంస్థ తన విచారణను మరింత ముమ్మరం చేసింది. ఐసీస్ , ఏక్యూఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు, వాటి ప్రచారాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో భాగంగా బుధవారం

➤ మిగతా 2వ పేజిలో..

### పేపర్ లీక్ పై రాహుల్ గాంధీ

# సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
నీట్–యూజీ పరీక్ష వివాదం సృష్టించిన ప్రకంపనలు ఇంకా ముగియకముందే, తాజాగా యూజీసీ–నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై కూడా లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోషల్

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రజలను తప్పు దోవపట్టించేలా కేంద్రం

**మొదటిపేజీ తరువాయి..** ప్రభుత్వ కంపెనీలు లేదా గిరిజనులు మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా తామేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ఆయన నిలదీశారు.

తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా మీడియా ముందుంచారు. 2021లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందని, కానీ ఆ అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇన్నాళ్లూ ఫైళ్లను పెండింగ్‌లో పెట్టి కాలయాపన చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం లీజు ఇవ్వకపోవడం వల్లే సింగరేణికి వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై తానే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, 2024 మార్చిలో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు రాకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కష్టపడి తెచ్చుకున్న అనుమతులను, ఎప్పుడో ఉన్న కేటాయింపులను తామే చేశామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు.

కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022లో కోయగూడెంలోని బ్లాక్-3ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ బినామీలు ఆ ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారని, అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్ అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయకుండా తీవ్ర నష్టం చేసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులతో పాటు తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# 'కుచ్ కుచ్ హోతా హై'

**మొదటిపేజీ తరువాయి..** రెండు దేశాలు కలిసికట్టుగా అడుగులు వేసినప్పుడు మన ప్రయాణం కేవలం 'కుచ్ కుచ్' (కొద్దిగా) దగ్గరే ఆగిపోకూడదని, 'బహుత్ కుచ్' (చాలా ఎక్కువ) సాధించే దిశగా సాగాలంటూ మోదీ వ్యాఖ్యానించారు. ప్రధాని నోట వచ్చిన ఈ సినిమాటిక్ డైలాగ్‌కు సభలో ఉన్నవారంతా చప్పట్లతో ఘనస్వాగతం పలికారు.

అంతర్జాతీయ వేదికపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన సినిమాను, పాటను ప్రస్తావించడం పట్ల ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. జకార్తాలో గౌరవనీయ ప్రధానమంత్రి తన చిత్రం గురించి మాట్లాడటం తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. ప్రేమకు సరిహద్దులు లేవని, అది అందరికీ అర్థమయ్యే ఒక విశ్వజనీనమైన భాష అని ఈ ఘట్టం మరోసారి నిరూపించిందని కరణ్ జోహార్ అభిప్రాయపడ్డారు. తమ సినిమాను అంతటి ప్రాధాన్యత కలిగిన వేదికపై గుర్తుచేసుకున్నందుకు ప్రధాని మోదీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాల

### అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష

**హైదరాబాద్, :** నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఫలితాలు ఏకపక్షమే

**మొదటిపేజీ తరువాయి..** కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఈ వేదికగా ఆయన హామీ ఇచ్చారు. వీటితో పాటు రెవెన్యూ శాఖ పరిధిలో గద్వాల జిల్లాకు అవసరమైన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను త్వరలోనే మంజూరు చేస్తామని ప్రకటించారు. తమది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## పేపర్ లీక్ పై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** మీడియా వేదికగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత బలాన్ని చేకూర్చాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందే దాదాపు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ (ట్విటర్) పోస్ట్‌లో పేర్కొన్నారు. అందులోని సుమారు 90 ప్రశ్నలు అసలు సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయని ఆయన ఆరోపించారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఒక్కొక్కటి సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ధ్వజమెత్తారు. ఇదే నేరస్థుల నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి ఇతర పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా అక్రమంగా సరఫరా చేస్తోందని, గత జూన్ 30న జరిగిన ఈ పరీక్షకు ముందే పేపర్ లీకైందన్న మీడియా కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

మరోవైపు హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన ఇద్దరు విద్యార్థి నాయకులు ఒక వీడియోను పంచుకుంటూ.. పరీక్షకు ముందే తాము సేకరించిన రెండు క్వశ్చన్ పేపర్ సెట్లలో ఒకటి అసలు ప్రశ్నపత్రంతో పూర్తిగా సరిపోలిందని స్పష్టం చేశారు. ఈ లీక్ వివాదంతో పాటు, పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు కూడా ఈ ప్రశ్నపత్రంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్వశ్చన్ పేపర్‌లో అనేక అక్షర దోషాలు, వ్యాకరణ లోపాలు ఉండటమే కాకుండా ఎంతోమంది ప్రముఖ సామాజిక శాస్త్రవేత్తల పేర్లను కూడా తప్పుగా ముద్రించారని, అసలు స్పష్టత లేని ప్రశ్నలను అడిగారని విద్యార్థులు సోషల్ మీడియాలో ఉదాహరణలతో సహా ఎండగడుతున్నారు. అంతేకాకుండా, మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలోని ప్రశ్నలతో అక్షరాలా సరిపోలాయని, ఆఖరికి మల్టిపుల్ ఛాయిస్ ఆప్షన్ల క్రమం కూడా మార్చకుండా అలాగే ఇచ్చేశారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అయితే, దేశవ్యాప్తంగా ఇంతటి గందరగోళం రేపుతున్న ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన లేదా వివరణ రాలేదు.

## నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతతో పాటు నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, వేడి నీరు, మెరుగైన పారిశుద్ధ్యం మరియు సకాలంలో వైద్య సేవలు అందేలా ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురుకుల విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం మరియు వర్షాకాల ముందస్తు ఏర్పాట్లపై మంత్రి బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో తాత్కాలిక నియామకాలు చేపట్టి, బోధనకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు.

వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, కాబట్టి ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నీటి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ, అవసరమైన చోట వాటర్ ప్యూరిఫైర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. ముఖ్యంగా బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని, టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, మహిళా ఆరోగ్యంపై అవగాహనతో పాటు అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు సిద్ధంగా

# పశ్చిమాసియాలో మరోసారి రాజుకున్న అగ్గి

**మొదటిపేజీ తరువాయి..** చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమయ్యాయని, ఖేష్మ్, బందర్ అబ్బాస్, సిరిక్ వంటి తీరప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడి నుంచే ఈ దాడులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అంతకుముందే ఇరాన్‌కు చెందిన చమురు విక్రయాల లైసెన్స్‌ను కూడా అమెరికా రద్దు చేసింది.

అగ్రరాజ్యం జరిపిన ఈ దాడులపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. అమెరికా చర్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతున్న సమయంలో తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకే వాషింగ్టన్ ఈ కుట్రకు పాల్పడిందని ఐఆర్‌జీసీ దుయ్యబట్టింది. అమెరికా వేధింపులకు, ఒత్తిళ్లకు టెహ్రాన్ లొంగే ప్రసక్తే లేదని ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే బహ్రెయిన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అమెరికాకు చెందిన సుమారు 85 కీలక మిలిటరీ కేంద్రాలపై తాము విజయవంతంగా దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. అలాగే బుషెహర్ ప్రాంతంలో అమెరికాకు చెందిన అత్యాధునిక 'ఎంక్యూ-9' డ్రోన్‌ను కూడా కూల్చివేసినట్లు పేర్కొంది. ఇరాన్ ప్రయోగించిన మిస్సైళ్ల కారణంగా బహ్రెయిన్, కువైట్ దేశాల్లో అలర్ట్ సైరన్లు మోగడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. అయితే ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇరు దేశాల మొండి వైఖరితో పశ్చిమాసియా ప్రాంతం ప్రస్తుతం నిప్పుల కొలిమిని తలపిస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు దేశంలోని 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించిన పలు కీలక డిజిటల్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. ఈ రిక్రూట్‌మెంట్ మరియు ప్రచార కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులతో పాటు ఒక మైనర్ బాలుడిని కూడా జువెనైల్ హోమ్ నుండి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. గత మార్చి నెలలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసు ప్రాధాన్యత దృష్ట్యా, మే నెలలో ఇది ఎన్ఐఏకు బదిలీ అయింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలోనే ఐసిస్, ఏక్యూఐఎస్‌లకు సంబంధించిన అభ్యంతరకరమైన ప్రచార సామగ్రి లభ్యమైంది. అప్పట్లో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల నుండి సేకరించిన సాంకేతిక విశ్లేషణ, కీలక ఆధారాల ఆధారంగానే ఈ తాజా సోదాలు నిర్వహించారు. పట్టుబడిన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది. వీరంతా విదేశాల్లోని తమ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసి, అస్థిరతను సృష్టించడానికి కుట్రలు పన్నుతున్న మిగిలిన నిందితులను గుర్తించే దిశగా ప్రస్తుతం విచారణ ముమ్మరంగా సాగుతోంది.

## ఆర్టీసీ విలీనం చేసే వరకు పోరాటం

### శంకర్ గౌడ్ సంస్మరణ సభలో తలసాని

**హైదరాబాద్, :** ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు ముగిశాకే ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డ్రైవర్ శంకర్ గౌడ్ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసమే శంకర్ బలిదానం జరిగిందని పేర్కొన్నారు. వేలాదిమంది ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరుగుతుందని ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికులలో ఐకృత లేని కారణంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.శంకర్ గౌడ్ కుమారునికి ఉద్యోగం కల్పించడంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం పక్రియ కేసీఆర్ ప్రభుత్వంలోనే పూర్తయిందని, అపాయింటెడ్ డేను ప్రభుత్వం ప్రకటించడమే మిగిలి ఉండగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు.

## జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధిపరిచే దిశగా డిపీఆర్ రూపొందించాలి

- పర్యాటకులు మెచ్చే చారిత్రాత్మక ప్రదేశాలకు నిలయం మెదక్.
- రాష్ట్ర పర్యాటక శాఖ విడుదల చేసే నిధులతో మెదక్ టూరిజం సర్క్యూట్ కావడం తథ్యం.
- వడివడిగా అభివృద్ధి పనులు జరిగేలా పక్కా ప్రణాళికతో అధికారుల సమన్వయంతో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8(జన సంఘర్షణ)**

జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధిపరిచే దిశగా డీపీఆర్ రూపొందించాలని పర్యాటకులకు మెచ్చే టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసే దిశగా ఒడి ఒడిగా అభివృద్ధి పనులు జరగాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర టూరిజం శాఖ, జిల్లాలో వివిధ శాఖల అధికారులతో పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో పురావస్తు సంపద పరిరక్షణ, పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, అధికారతో సమీక్షించారు. పురావస్తు సంపద భద్రత, శాస్త్రీయ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి దేవాలయ అభివృద్ధి ఇటీవల టూరిజం శాఖ ద్వారా మంజూరు చేసిన 07 కోట్ల రూపాయల వ్యయంతో కాటేజీల నిర్మాణం చేపట్టాల్సిన పనులపై టెంపుల్ మాస్టర్ ప్లాన్ అధికారులతో చర్చించి, సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఆలయ చారిత్రక, పర్యాటక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం మెదక్ ఖిలా, పోచారం డ్యామ్, బారాకమాన్, గోల్ బంగ్లా, మిగతా చారిత్రాత్మక ప్రదేశాలు ప్రస్తుతం చేపట్టాల్సిన అభివృద్ధి, పరిరక్షణ పనుల డిపిఆర్ రూపొందించి తద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలోని చారిత్రక, వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కిలాకోట అభివృద్ధికి 57 లక్షల రూపాయలు, అలాగే ఏడుపాయల టెంపుల్ కాటేజి నిర్మాణాలకు ఏడు కోట్ల రూపాయలు రాష్ట్ర టూరిజం శాఖ మంజూరు చేసిన విషయం మనందరికీ తెలిసిన విషయమైతే పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించే విధంగా టూరిజం శాఖ,ఇతర శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యలను నివృత్తి చేసుకుంటూ ప్రజలను మమేకం చేస్తూ పర్యాటకులకు మెచ్చే విధంగా మెదక్ ను టూరిజం సర్క్యూట్ రూపొందించి రాష్ట్రంలోనే మెదక్ ను టూరిజం సర్క్యూట్ తల మానికంగా తయారుచేసి ముందు వరుసలో ఉంచేందుకు పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ ,తెలంగాణ టూరిజం ప్రతినిధులు రామకృష్ణ, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఈ.ఈ శ్రీశైలం, కన్సల్టెన్సీలు అమృత, జిల్లా అధికారులు డీఎఫ్ఓ జోజి, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, ఏడుపాయల టెంపుల్ ఈవో వీరేశం, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ

- సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి.
- రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగించాలి.
- సీసీ కెమెరాల ఏర్పాటు, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలి.
- మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8 (జన సంఘర్షణ)**

బుధవారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీసు సిబ్బంది కిట్‌ను పరిశీలించారు. కిట్ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా కానిస్టేబుల్ శ్రీలేఖను రివార్డుతో అభినందించారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు, స్టేషన్ డైరీలు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లలో పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన, పారదర్శకమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని చెప్పారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణతో పాటు సిబ్బంది వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.





## ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్లు నిర్మించాలి

- ఇంకెంత మంది చనిపోవాలి?
- ఐదు నెలల్లో 45 ప్రమాదాలు.. 35 మంది మృతి.
- శ్రీఆద్య హోటల్, దామర చెరువు బైపాస్‌ల వద్ద ప్రమాదాలపై ఆందోళన.
- వచ్చే మంగళవారం నాడు రామాయంపేట బైపాస్ రోడ్డు వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాలు చేస్తాం.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి వెల్లడి.
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8: (జన సంఘర్షణ)**

జాతీయ రహదారి-44పై రామాయంపేట సమీపంలోని ఆద్య హోటల్ జంక్షన్, దామర చెరువు బైపాస్ వద్ద ఫ్లైఓవర్లు లేకపోవడంతో వరుసగా ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఆమోదం తెలిపి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బుధవారం రామాయంపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై రోడ్డు దాటేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హైవేపై అధిక వేగంతో వాహనాలు ప్రయాణించడం,రోడ్డు ఎత్తుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందిస్తాయి” అంటూ ప్రశ్నించారు. గత ఐదు నెలల్లోనే ఈ ప్రాంతంలో సుమారు 45 రోడ్డు ప్రమాదాలు జరిగి 35 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఆద్య హోటల్ జంక్షన్, దామర చెరువు బైపాస్ వద్ద వెంటనే సాంకేతిక సర్వే నిర్వహించి ఫ్లైఓవర్ లేదా బైపాస్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాణాల కంటే ప్రభుత్వాలకు మరేదీ ముఖ్యమైనది కాదని, మరిన్ని ప్రాణనష్టాలు జరగకముందే శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామాయంపేట బైపాస్ వద్ద వరుస ప్రమాదాలను నివారించేందుకు ఫ్లైఓవర్ నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే స్థానిక ప్రజలను కలుపుకొని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో హైవే దిగ్బంధనం, ధర్నా వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాత్రావు, పీఏసీసీఎస్ చైర్మన్ చంద్రం, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కు. ప్రవీణ్ చౌదరి చరిత, రమేష్, మాజీ పర్వతాపూర్ సర్పంచ్ బోయిని స్వామి, మెదక్ మార్కెట్ కమిటీ ,మెదక్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, జుబేర్ అహ్మద్, మెదక్, హవెలిఘనపూర్, నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షుడు. అంజ గౌడ్, సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాయకులు ఎస్కే అహ్మద్, అసలుద్దీన్, అల్లాడి వెంకటి, వినయ్ సాగర్, ఉమా మహేశ్వర్, నవీన్, విద్యాకర్, శ్రీనివాస్, వంశీ, సాయి, మాయ మల్లేశం, సాదిక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించాలి

**నిజామాబాద్/జూలై 8/(జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ అన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సేవలను విస్తరించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ అన్నారు. వైద్య కళాశాల, జీజీహెచ్ మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని జీజీహెచ్లో మంగళవారం నిర్వహించారు.






**చురుకుగా పాల్గొనాలి..**

కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సైకియాట్రీ పీజీ విద్యార్థులు, ఎంబీబీఎస్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాలు, మత్తు పదార్థాల నివారణ (డ్రగ్ డీ-అడిక్షన్) అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. గ్రామీణ ప్రజల్లో మానసిక వ్యాధులు, మత్తు పదార్థాల వ్యసనంపై ఉన్న అపోహలను తొలగించడం, ముందస్తు గుర్తింపు, చికిత్సకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన, సృజనాత్మకత, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎంబీబీఎస్, నర్సింగ్ విద్యార్థుల కోసం పోస్టర్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎల్. రాములు గౌరవ అతిథిగా హాజరై విద్యార్థులు సేవలను అభినందించారు. కార్యక్రమాన్ని మానసిక వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ విశాల్ అకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రదీప్, రమణ, అరుణ్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన ఏజెన్సీపై కలెక్టర్ ఆగ్రహం.. తొలగించాలని ఆదేశాలు

**నిజామాబాద్/ జూలై 8/(జన సంఘర్షణ)**

వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.



**జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో..**

జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉంది, ఈగలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత గురించి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నందున, ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు.

**వర్షాకాలంలో పరిశుభ్రత పాటించకపోతే ఎలా..?.**

వర్షాకాలంలో వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడవద్దని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపిస్తూ, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ సెకండియర్ బైపీసీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులతో భేటీ అయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితర సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు ఉన్నారు.

## సిద్ధంశెట్టి సంగయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8(జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పాత లింగయిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు,చీకోడ్ పీఏసీఎస్ చైర్మన్ సిద్ధంశెట్టి.దత్తు తండ్రి. సిద్ధంశెట్టి.సంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి బుధవారం పాత లింగాయిపల్లి గ్రామానికి చేరుకుని సంగయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దత్తు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ,ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరి వెంట పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, పోలీస్ వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆర్కెల్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ దుర్గయ్య, పాపన్నపేట పిఎసిఎస్ చైర్మన్ మల్లేశం, రామతీర్థం సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, నవీన్ గౌడ్, నాయకులు వెంకటేశం సెట్, బాబా గౌడ్, కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## పవిత్ర ఉమ్రా దైవ దర్శన యాత్రకు బయలుదేరిన మెదక్ పట్టణానికి ఐదో వార్డ్‌కు చెందిన అర్బాజ్ నవీన్

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8 (జన సంఘర్షణ)**

మెదక్ పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ముస్లిం సోదరుడు అర్బాజ్ నవాబ్, ఆయన తండ్రి అజ్జు మరియు కుటుంబ సభ్యులు పవిత్ర ఉమ్రా దైవ దర్శన యాత్రకు ఈరోజు బయలుదేరిన సందర్భంగా, వారి స్వగృహంలో 5వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. అర్బాజ్ నవాబ్, ఆయన తండ్రి అజ్జు, కుటుంబ సభ్యులు ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని, వారి ప్రార్థనలు దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నెలకొనడానికి, మెదక్ పట్టణ ప్రజలందరికీ మేలు చేకూరాలని ఆకాంక్షించారు.



జన సంఘర్షణ
గురువారం
09 జులై 2026

# మెదక్ జిల్లాలోని 'అగర్వాల్ ఫౌండ్రీస్' కంపెనీ విస్తరణ ఆపి వెయ్యాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లాలోని గ్రామస్తుల నిరసనలు ధర్నాలు ఆందోళనలు చేసిన పట్టించ్చుకోడం లేదుని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి ప్రతాప్ ఓటరు ప్రతాప్ రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. మెదక్ జిల్లాలోని రంగాయపల్లి, చెట్ల గౌరారం పరిసర గ్రామాల ప్రజలు తమ ప్రాంతంలోని ఎం/ఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విస్తరణపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ కంపెనీ విస్తరణను వెంటనే నిలిపివేయాలని, ఆ పరిశ్రమను తమ ప్రాంతం నుండి తరలించాలని కోరుతూ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కంపెనీ నుండి వెలువడుతున్న కాలుష్యం కారణంగా స్థానిక ప్రజలు శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు గుండె జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కంపెనీ వల్ల గాలి,ధూళి భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని, దీని ప్రభావంతో వ్యవసాయ భూములు దెబ్బతిని పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయని రైతులు వాపోయారు. కంపెనీ విస్తరణకు సంబంధించి గతంలో నిర్వహించిన రెండు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాల్లో భారీగా పోలీస్ బలగాలను మోహరించడం వల్ల, తాము స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించలేకపోయామని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా జరిగిన ఈ ప్రక్రియపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



**గ్రామస్తుల డిమాండ్లు**

కంపెనీ విస్తరణకు అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కాలుష్య సమస్యపై స్వతంత్ర నిపుణులతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని, వ్యవసాయాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే స్వేచ్ఛాయుత వాతావరణంలో మళ్లీ ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రంపై రంగాయపల్లి, చెట్ల గౌరారం గ్రామాల బాధితులు సంతకాలు చేసి, అధికారుల జోక్యం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రెండు మూడు రోజులలో పెద్ద ఆందోళనలు చెప్పట్టుతుమని హెచ్చరించారు.

# భూభారతి చట్టం వల్ల రైతులకు రైతులకు అద్భుతమైన ప్రయోజనాలు

- **భూభారతి సభ్యుడు భూమి సునీల్ స్పష్టం చేశారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

భూభారతి చట్టం వల్ల రైతులకు అద్భుత ప్రయోజనాలు కలవని ఈ ప్రక్రియ మెదక్ జిల్లాలో అత్యంత పారదర్శకంగా జరగాలని భూభారతి సభ్యుడు భూమి సునీల్ కుమార్ స్పష్టతనిచ్చారు. మెదక్ జిల్లాలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ సంబంధిత ఆర్డీవోలు తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లకు భూభారతి చట్టంపై సుదీర్ఘంగా భూభారతి సభ్యుడు సునీల్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ వివాదాలకు చెక్



పెట్టేందుకు,్రైతులకు పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ప్రక్రియపై రెవెన్యూ యంత్రాంగం సుదీర్ఘ అవగాహన అవసరమని స్పష్టం చేశారు రైతుల భాగస్వామ్యంతో : రీసర్వే సమయంలో రైతులు తమ భూములను చూపించి, హద్దురాళ్ళు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో భూ తగాదాలు రాకుండా నివారించవచ్చు. అని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో (రోవర్స్) ప్రతి భూమి సరిహద్దులను పక్కాగా నమోదు చేసి డిజిటల్ మ్యాపింగ్ చేస్తున్నట్లు వివరించారు. పేర్ల తప్పులు, విస్తీర్ణం తేడాలు, మరియు వివాదాలను పరిష్కరించి, భూమి రికార్డులను పారదర్శకంగా భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, సర్వే ప్రాముఖ్యత గురించి చట్టాలపై సుదీర్ఘ వివరణతో జిల్లాలో రీ సర్వే ప్రక్రియ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులకు భూ భారతి చట్టంపై శిక్షణ అవగాహన విధి నిర్వహణ బాధ్యతల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..భూ రికార్డుల నిర్వహణ, భూమి హక్కుల రికార్డు (ఆర్.ఓ.ఆర్), వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ రకాల రెవెన్యూ సర్వీసుల గురించి అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. భూ భారతి చట్టంలోని ముఖ్యమైన సెక్షన్ల గురించి వివరించారు.పటం, ప్రాథమిక సమాచారం, నీరు,ఇసుక, ఇతర మైనింగ్ కార్యకలాపాలపై నియంత్రణతో పాటు,కులం, నివాసం,ఆదాయం, లోకల్ ఏరియా ఇతర ధృవీకరణ పత్రాల మంజూరు కొరకు విచారణ నివేదికలో క్రియాశీలంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మ్యాప్‌లు ఖచ్చితంగా విధి నిర్వహణలో వెంట ఉండాలని, సెత్వార్, ఖాస్రా వంటి రికార్డులపై ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అసాధారణ సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉండాలని,ప్రాథమిక సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు. శిఖం భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణ జరగకుండా సందర్శించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రేవన్యూ వ్యవస్థ ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రెవిన్యూ చట్టాలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ముఖ్య భూమిక వహించాలని కోరారు. అలసత్వం చూపకుండా నిబద్ధత, క్రమశిక్షణ తో విధులు నిర్వహించాలని తెలిపారు. రెవిన్యూ సెక్షన్లపై పూర్తి పట్టుండాలని ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రెవిన్యూ చట్టంలోని పలు ముఖ్య సెక్షన్ల గురించి వివరించారు. గ్రామసభల్లో నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో వచ్చినటువంటి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించలన్నారు. చట్టాలను ఉపయోగించే సందర్భంలో రూల్స్ పాటించాలని, సమస్యలను పరిష్కరించే విషయం లో ఏవైనా సందేహాలుంటేపై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ట్రైనర్ భూమి సునీల్ భూ భారతి చట్టంలో గురించి వివరించారు.తహశీల్దార్లు, ఆర్ఐ లు, సర్వేయర్లు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ ల్యాండ్ సర్వే ఎ,డి కిషన్ ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ,బవయ్య, ట్రైనీ ఆర్డీవో మహమ్మద్ అహ్మద్, తహశీల్దార్లు, ఆర్ఐ లు, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# వై ఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 08(జనసంఘర్షణ):

చర్ల మండలం, చర్ల గ్రామపంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఎంపీ క్యాంప్ ఆఫీస్ నందు స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రైతు బాంధవునికి పార్టీ నాయకులు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప్పరగూడెం గ్రామం మహిళా నాయకురాలు సావిత్రి,నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, సుందరి సురేష్, ఆవుల శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, జవ్వాది రవి, మేడిచర్ల వీరకుమార్, విస్సా నాగభూషణం, అలవాల బాలు, మునిగల సాగర్, మాటూరు సాంబశివరావు, బొమ్మ వీరరాఘవయ్య, పూజారి రమణయ్య, బొమ్మల సుదీర్, ఇసంపల్లి రమేష్, కొత్తపల్లి, చిన్నముసిలేరు, పెద్దముసిలేరు, నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు చర్ల మండలం వ్యాప్తంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమాన సంఘ నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమైనది.



# కొమరంభీం సైన్యం ప్రారంభం

ములుగు జిల్లా, మేడారం, జులై 08(జనసంఘర్షణ):

మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం నుండి కొమరం భీం సైన్యం ప్రారంభోత్సవం తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్న చేతుల మీదుగా జరిగింది. కొమరం భీం సైన్యం యొక్క ముఖ్య ఉద్దేశం యువతి, యువకులు, మేధావులు కొమరం భీమ్ సమ్మక్క సారలమ్మ స్ఫూర్తితో జాతీయాస్తిత్వం కోసం ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా జాతీయ ఉపాధ్యక్షులు పొడెం. బాబు, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, ములుగు జిల్లా అధ్యక్షులు నల్లబోయిన లక్ష్మణరావు, ఏ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, ఏ ఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కలివేటి పవన్ కుమార్, ఏ ఎస్ యు ఉప అధ్యక్షలు పోలేబోయిన గణేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపఅధ్యక్షులు సోడి అనిల్ కుమార్, చర్ల మండల అధ్యక్షులు శ్యామల తరుణ్ కుమార్ పాల్గొన్నారు




# వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన మున్సిపాలిటీ చైర్మన్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8(జన సంఘర్షణ)

రామాయంపేట మున్సిపాలిటీ లోని 7వ వార్డుకి చెందిన తుమ్మల రాజయ్యబి లక్ష్మి కుమారుడు ప్రవీణ్ వివాహానికి హాజరు అయిన మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, కౌన్సిలర్ దేవుని రంజిత్,గుగులోత్ రవి, పుట్టి సందీప్, మాజీ పట్టణ అధ్యక్షుడుదాకి స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల స్వామి, మట్టి యాదగిరి, రాధా కిషన్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, దేవుని నరేష్,దాకి నాగేందర్, సుధీర్ గౌడ్, సోహెల్ కార్తీక్, నరేందర్ పాల్గొనడం జరిగింది.



# తెలుగు రాష్ట్రల ప్రజానాయకుడు వైఎస్సార్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8 (జన సంఘర్షణ)

ప్రతీ ఇంటికి పెద్దన్న పేదవాడి గుండెల్లో వుండే దేవుడు చిరునవ్వుల రారాజు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫీజ్ ఉద్దీన్ అన్నారు.మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించరు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం పనిచేసిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ఉచిత కరెంట్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ సంక్షేమ పథకాల ద్వారా పేదలు, విద్యార్థులు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం వెనుక పేదవాడిపై ఉన్న అపారమైన ప్రేమ, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత ప్రతిబింబిస్తుందని అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ప్రతి పేదవాడి ఇంటిలో, ప్రతి రైతు గుండెల్లో ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. మహానేత ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని హాఫీజ్ ఉద్దీన్ పేర్కొన్నారు.



# జూలై 10న విద్యాసంస్థల సంపూర్ణ బంద్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

ఈనెల 10న(శుక్రవారం) ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు జిల్లాలోనీ అన్ని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పూర్తి సహకారం అందించాలనీ ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రచాకలి పాపయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థుల సమస్యల పరిష్కారం ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈబంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలనీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాలనీ సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలనీ తెలిపారు. నాణ్యమైన, ఉచిత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనీ జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, గిరిజన అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

ఐసీడీఎస్ రామాయంపేట ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, గిరిజన అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా రామాయంపేట మండలానికి సంబంధించి మొత్తం 4 అంగన్‌వాడీ టీచర్ (ఏ డబ్ల్యు టి) పోస్టులు, 02 అంగన్‌వాడీ హెల్పర్ (ఏ డబ్ల్యు హెచ్)రామాయంపేట మున్సిపల్ పరిధిలో 1 అంగన్‌వాడీ టీచర్ భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయబడుతోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలకు అధికారికంగా పంపించబడతాయి. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 10వ తేదీ నుండి ప్రారంభమవుతుంది.

# కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు విజయ్ నాయుడుకి ఘన సత్కారం

- **మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 9(జనసంఘర్షణ):




చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ నాయుడుని మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటీసీ మడకం పద్మజ, విజయ్ కుమార్ నాయుడుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మరింత చేరువ ఆవుతుందని ఆకాంక్షించారు. అనంతరం విజయ్ కుమార్ నాయుడు, ఆమెకు ధన్యవాదాలు తెలియజేస్తూ, పార్టీ కార్యకర్తలు, నాయకులందరి సహకారంతో పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాసేవే ధ్యేయంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## రికార్డుల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

◆ డీసీఆర్బీ విభాగాన్ని తనిఖీ చేసిన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ) విభాగాన్ని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఆర్బీలో నిర్వహిస్తున్న రికార్డులు, నేరాలకు సంబంధించిన డేటా, పెండింగ్ అంశాలు, కేసుల వివరాలు, సీసీటీఎన్ఎస్ నమోదు, ఈ-సాక్ష్య రికార్డులు, వారెంట్ల అమలు, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చే సమాచారాన్ని సకాలంలో నమోదు చేసి ఖచ్చితమైన రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పోలీస్ స్టేషన్లతో సమన్వయాన్ని మరింత పెంచాలని సూచించారు. అలాగే, డీసీఆర్బీ పరిధిలోని అవసరమైన రికార్డులు, సమాచారాన్ని స్టేట్ రికార్డ్స్ బ్యూరో కు సకాలంలో పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేరాల విశ్లేషణ, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని, విధుల నిర్వహణలో క్రమశిక్షణ, జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ జార్జ్‌తో పాటు డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన చెందొద్దు

◆ ప్రమాద స్థలాన్ని గుర్తించి వెంటనే సమాచారం ఇవ్వాలి: జిల్లా అగ్నిమాపక అధికారి కె. వెంకటేశం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8(జన సంఘర్షణ)



మెదక్ పట్టణములోని సోషల్ వెల్ఫేర్ ట్రబుల్ డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదలు గురుంచి విద్యార్థిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, విద్యాసంస్థల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థులు, సిబ్బంది ఆందోళనకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె. వెంకటేశం సూచించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ముందుగా గుర్తించి, అక్కడి పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకుంటే సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. హఠాత్తుగా అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని, అత్యవసర సేవల కోసం అగ్నిమాపక టోల్ ఫ్రీ నెంబర్ 101 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతం, సమీప గుర్తులు, పరిస్థితులను స్పష్టంగా తెలియజేస్తే అగ్నిమాపక సిబ్బంది త్వరగా చేరుకుని సహాయక చర్యలు చేపడతారని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో అగ్ని భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి కె. వెంకటేశం తెలిపారు.

## డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఘనంగా నిర్వహణ





జన సంఘర్షణ8-7-2026

మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా అశ్వారావుపేట ఆర్యవైశ్య సంఘం, మహాత్మా ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నాయకులు, క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడం, నిరుపేదలకు 108 అంబులెన్స్, 104 ఆరోగ్య సేవలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళల సాధికారత కోసం పావలా వడ్డీ వంటి పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, సంక్షేమ పాలనకు నిదర్శనంగా నిలిచిన మహానేతగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని వక్తలు అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాత్మా ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్, జల్లిపల్లి దేవరాజు, కొల్ల అరుణ్ కుమార్, సత్యవరపు హేమంత్, అబ్బాస్, రామ్ సాయి బూస్ పాండు, దోపకుంట్ల శ్రీను, నడిపెల్లి చందు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నతల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

◆ జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించిన జిల్లా న్యాయస్థానం.
◆ శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)

కన్నతల్లిని హత్య చేసిన కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే, టేక్మాల్ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన మోహన్ సుదర్శన్ మద్యానికి బానిసై తరచూ తన భార్యను వేధించేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం సుదర్శన్ తన తల్లి సత్యమ్మ వద్దకు వెళ్లి డబ్బులు కావాలని మద్యం మత్తులో తరచూ గొడవపడుతూ, దుర్భాషలాడుతూ, దాడులకు పాల్పడేవాడు. అలాగే తన భార్యను తిరిగి తీసుకురావాలని తల్లితో తరచూ వివాదానికి దిగేవాడు. ఈ క్రమంలో 08-11-2025 అర్ధరాత్రి మద్యం మత్తులో తల్లితో మరోసారి గొడవపడి, కర్రతో ఆమె తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన సత్యమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు అధికారి (ఐఓ) అల్లాదుర్గ్ సీఐ రేణుక శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాధారాలు సేకరించి దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు.కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు,సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు మోహన్ సుదర్శన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతమైన వాదనలు వినిపించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్,




సీడీఓ కృష్ణ సమన్వయంతో పనిచేశారు. ఈ కేసులో తక్కువ సమయంలో దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజన్ అధికారులు,పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## పిల్లల భవిష్యత్తు లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్

రుద్రూర్/జూలై 8/(జన సంఘర్షణ)




రుద్రూర్ మండలం నిజామాబాద్ జిల్లా చదువుకు, భద్రతకు దూరమై జీవనం సాగిస్తున్న చిన్నారుల సంక్షేమం, భవిష్యత్ లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైంది. మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలో బాలల సంరక్షణ అధికారులు బస్టాండ్లలో, స్వీట్ హోమ్, ఇటుక బట్టీలు, హోటళ్లు, దుకాణాలు, మెకానిక్ షాపులు, నిర్మాణ స్థలాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దుకాణ యజమానులతో మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఒకవేళ బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానుల పై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో సునీత, శంకర్, బాబు, తుకారాం, నరేందర్ రాజు తదితరులు ఉన్నారు.

## ఇదేం నిర్లక్ష్యం.. ప్రాణం తీసిన బస్సు!

విజయవాడ/జూలై8/(జన సంఘర్షణ)






విజయవాడ బస్టాండ్లో షాకింగ్ యాక్సిడెంట్ జరిగింది. పల్లెవెలుగు బస్సు ఓ వ్యక్తిపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యాడు. అతడు ఫోన్ చూస్తూ నడుచుకుంటూ వెళ్తుండగా అటుగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. టైర్లు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదానికి డ్రైవర్తో పాటు మృతుడి నిర్లక్ష్యమూ కారణమని వీడియో చూస్తే స్పష్టమవుతోంది.

# మెడికల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కామారెడ్డి జిల్లా, కామారెడ్డి, జులై 08(జనసంఘర్షణ):

కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి, కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు రెండవ రోజు ధర్నా నిర్వహించిన కార్మికులు, ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఎల్ దశరథ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేస్తానని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఆమె ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఇప్పుడు ఇస్తున్న 15 వేల 600 ప్రభుత్వము కాంట్రాక్టర్లకు ఇవ్వడం జరుగుతుంది. కానీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ పోగా 11 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ద్వారా ఇవ్వడం వల్ల రాష్ట్రంలో కాంట్రాక్టర్ల కార్మికుల మిగిలిన పైసలు ప్రభుత్వానికి ఉపయోగ ఉంటుందని కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ కార్మికు సంబంధించిన వితరాల సవరణ ఒప్పంద కాల పరిమితి ముగిసిన సంవత్సరమవుతుందని ఇప్పటివరకు వేతనాలు అన్యాయమని వారన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ను ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, పిఆర్సి ప్రకటించడం కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇప్పటివరకు సుప్రీంకోర్టు జీవో ప్రకారం 26 వేల వేతనం ఇవ్వాలని, సంవత్సరానికి 23 జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని, పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని, ఈ ధర్నా సందర్భంగా వారు డిమాండ్ చేశారు, అదేవిధంగా ఈనెల 9వ తేదీ కోటి లోని డిఎం కార్యాలయం ముందు ముట్టడి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా, ఏఐటీయూసీ అనుబంధ సంఘం. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ పిలుపునివ్వడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్




ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ దశరథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి బాలరాజ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రవీణ్, నరేష్, ఆస్పత్రి కార్మికులు కే శ్రీనివాస్,ఎండి రఫీక్, ఎస్.కె పాజియా, ఫాతిమా బైరమ్మ, లక్ష్మీ, మమత,శ్యామల బాలు,పర్వీన్ బేగం సతీష్,నర్సింలు, దశరథ్, అజయ్, సందీప్, మహేందర్, సంతోష్, బి లక్ష్మి, రజిత, మల్లేష్, రాజ్యలక్ష్మి, లక్ష్మణ్, భాగ్యమ్మ, బాలరాజ్, గౌతమ్, సంజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

◆ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు
◆ 27వేల ప్రభుత్వ పాఠశాలలు 4వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
◆ పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ విడుదల చేయాలి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, జులై 08(జనసంఘర్షణ):

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల జులై 10న విద్యారంగా సమస్యల పరిస్కారం కోసం రాష్ట్ర వ్యాప్తం బంద్‌ను జయప్రదం చెయ్యాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి మునిగాల శివ ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలు 4వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనీ, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను వెంటనే మానుకోవాలనీ, ప్రభుత్వ విద్యకు తగిన బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలనీ, అన్ని ఖాళీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ, ప్రైవేట్,




కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి కఠిన నియంత్రణలు అమలు చేయాలనీ, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల బలవంతపు అమ్మకాలను నిలిపివేయాలనీ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించాలనీ, పెండింగ్ లో ఉన్న 7 వేల కోట్ల విద్యార్థుల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలనీ, రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, మధ్యాహ్నం భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ వంటివి అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య, లౌకిక, శాస్త్రీయ విద్యను కాపాడుకోవడానికి, విద్యాహక్కును పరిరక్షించుకోవడానికి ప్రతీ విద్యార్థి జూలై 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగస్వామి కావాలనీ, ఈ బంద్‌ను విజయవంతం చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృతజ్ఞతలతో ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెళ్లి చేసుకుంటానని 9 ఏళ్లు నమ్మించి మోసం చేశాడు

- సర్పంచ్‌పై యువతి ఆరోపణలు
- సహజీవనం, బలవంతపు గర్భస్రావాలు, పెళ్లికి నిరాకరణ అంటూ ఫిర్యాదు
- ఆరోపణలను రాజకీయ కుట్రగా కొట్టిపారేసిన సర్పంచ్ దస్తగిరి

బోధన్, /జూలై 8:/ (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం గ్రామ సర్పంచ్ దస్తగిరిపై ఓ యువతి తీవ్ర ఆరోపణలు చేసింది. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా ప్రేమ పేరుతో తనను నమ్మించి, సర్పంచ్ అయిన తర్వాత పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి చివరకు మోసం చేశాడని బాధితురాలు సీమ ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె మీడియాకు తెలిపింది.

**పాఠశాల దశలో మొదలైన పరిచయం....**

పాఠశాలలో చదువుతున్న రోజుల నుంచే దస్తగిరి తనను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడని, ఆ పరిచయం ప్రేమగా మారిందని సీమ తెలిపింది. అనంతరం తనకు జరిగిన రెండు వివాహాలు కూడా దస్తగిరి ప్రేరేపణతో విడాకుల వరకు వెళ్లాయని ఆరోపించింది. చివరికి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బోధన్‌లో పలువురు సంవత్సరాలు సహజీవనం చేశాడని పేర్కొంది. గర్భస్రావాలు చేయించాడని











ఆరోపణ.. సహజీవనం సమయంలో రెండుసార్లు గర్భం దాల్చగా టాబ్లెట్లు ఇచ్చి గర్భస్రావం చేయించాడని సీమ ఆరోపించింది. అనంతరం తనకు తెలియకుండా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గర్భసంచి తొలగించే శస్త్రచికిత్స చేయించారని కూడా ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఓ స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు కూడా సహకరించాడని ఆమె పేర్కొంది.

**పెళ్లికి నిరాకరణ.. న్యాయం కోరుతున్న బాధితురాలు....**

సర్పంచ్ అయిన తర్వాత పెళ్లి విషయాన్ని పదేపదే తప్పించుకుంటూ చివరకు "పెళ్లి చేసుకోను.. ఏం చేసుకుంటావో చేసుకో" అని చెప్పాడని సీమ వాపోయింది. గ్రామ మజీద్ కమిటీ, మహిళా మండలి వద్ద ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపింది. న్యాయం జరగకపోతే సర్పంచ్ ఇంటి ఎదుట టెంట్ వేసి నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించింది.

**సర్పంచ్ వివరణ.....**

ఈ ఆరోపణలపై స్పందించిన సర్పంచ్ దస్తగిరి, తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ కక్షతో కూడినవేనని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకే ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. చట్టపరంగా ఎక్కడైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

---

## బాన్సువాడలో ఇంటర్ విద్యార్థిని మృతి ఘటనపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా

బాన్సువాడ,/ జూలై 08:/(జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఇంటర్మీడియట్ విద్యార్థిని అనుమానాస్పద మృతి ఘటనపై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మాట్లాడుతూ..విద్యార్థిని మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ ధర్నాలో మాజీ వార్డు సభ్యులు షేక్ అక్బర్, బాడి శ్రీను, ఫిరోజ్ ఖాన్,షేక్ ఖలీల్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి అసలు నిజాలను వెలికితీయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. విద్యార్థిని మృతి వంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల దర్యాప్తు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని నాయకులు డిమాండ్ చేశారు.

---

# అంగన్వాడి టీచర్ల పోస్ట్‌కు నోటిఫికేషన్ విడుదల


- జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిని కుమారి ఐ ప్రసన్న ఓ ప్రకటన విడుదల చేశారు

కామారెడ్డి బ్యూరో./జులై 8/(జన సంఘర్షణ)

అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఉండవలసిన అర్హతలు:

విద్య: సదరు అభ్యర్థునీలు తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండవలయును. ఆయా (హెల్పర్) పోస్ట్ కు ఇంటర్ అభ్యర్థినులు లేని యెడల 10వ తరగతి ఉత్తీర్ణులైన వారిని ఎంపిక పరిగణలోకి తీసుకోబడును. వయస్సు: 01/07/2026 నాటికి 18 సంవత్సరములు నుండి 35 సంవత్సరములలోపు ఉండాలి.

స్థానికత: దరఖాస్తు చేసుకోబోయే మహిళలు అంగన్వాడీ కేంద్రానికి తప్పనిసరిగా స్థానిక వాస్తవ్యులై ఉండాలి. గ్రామీణ ప్రాంతానికి సదరు గ్రామ పంచాయతీకి చెందిన వాడు అయి ఉండాలి.పట్టణ ప్రాంతానికి సంబందిత వార్డ్ కు చెందిన వారు అయి ఉండాలి.ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఎస్టీలకు కేటాయించిన అంగన్ వాడీ టీచర్ మరియు అంగన్ వాడీ హెల్పర్ పోస్టులకు అదే హామ్లెట్/ ఆవాసం కు చెందిన ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఎస్సీలకు కేటాయించిన అంగన్ వాడీ టీచర్, అంగన్ వాడీ హెల్పర్ పోస్టులకు అది గ్రామపంచాయతీకి చెందిన ఎస్సీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. సంబందిత తహసిల్దార్ ధృవీకరించిన నివాస ధృవీకరణ పత్రము తప్పనిసరిగా జతచేయవలయును. ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఒక సంవత్సరము లోపు తీసుకున్న నివాస ధ్రువీకరణ పత్రములను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది రిజర్వేషన్ పోస్టువారిగా నిర్దేశించిన రోస్టర్ పాయింట్ (కులం/వర్గం)కు సంభందించిన అభ్యర్ధనులు మాత్రమే అర్హులు. ఒక వేళ అభ్యర్ధన్ పేరులో ఏమైనా మార్పు ఉన్నట్లయితే అది గెజిట్ లో గాని, కోర్టు ఉత్తర్వులు గాని ఉంటేనే ఆ అభ్యర్థిని పేరును పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థినులు వారు దరఖాస్తు చేసుకున్న అంగన్ వాడి కేంద్రము యొక్క సంబంధిత ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ కార్యాలయములో తేది: 28.07.2026 నుండి 01.08.2026 వరకు అన్ని కార్యాలయ పని వేళలలో ఒరిజినల్ , లేని యెడల వారి దరఖాస్తులను పరిగణనలోనికి తీసుకొనబడవు. అభ్యర్థుల ఎంపిక క్రింది ప్రమాణాల ఆధారంగా జరుగుతుంది: ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ - 70 మార్కులు.ప్రత్యేక కేటగిరీలు : వితంతువులు -5 మార్కులు, అనాథలు -10 మార్కులు, దివ్యాంగులు-5 మార్కులుజిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ - 10 మార్కులు. దరఖస్తు http://wdcw.tg.nic.in వెబ్ సైట్ నందు మాత్రమే అప్లై చేయగలరు. ఈ క్రింద తెలపబడిన వికలాంగులైన



అభ్యర్ధినులు కూడా దరఖాస్తు చేసుకోనవచ్చు. వినికిడి పరికరాన్ని ఉపయోగించి వినగలిగిన వారు.. అంధత్వం ఉన్నప్పటికీ ఇతరుల సహాయం లేకుండా విదులు నిర్వర్తించు కోగలిగిన వారు. కాళ్ళు, చేతులకు సంబందించిన అంగ వైకల్యం కలిగినప్పటికీ పూర్వ ప్రాదమిక విద్యను నేర్పుటకు గానీ, పిల్లల సంరక్షణ కు ఏలాంటి ఆటంకం లేకుండా చేయగలిగిన వారు.

**ఆన్లైన్లో అప్లోడ్ చేయావలసిన ధ్రువపత్రాలు**

పుట్టిన తేది / వయస్సు ధృవీకరణపత్రము, ఎస్ఎస్సి సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రము తహసిల్దార్‌చే జారీ చేయబడ్డ సర్టిఫికెట్, విద్యార్హత ధృవీకరణపత్రము, ఇంటర్/ ఆ పై విద్య అర్హతలు మార్కుల జాబితా, నివాస ధృవీకరణపత్రము తహసిల్దార్‌చే జారీ చేయబడ్డ, అంగవైకల్యం కలిగిన వారు సదరం సర్టిఫికెట్, వితంతువు అయితే వర్గ మరణ ధృవీకరణపత్రము.. ఆనాథ అయితే ఆనాద సర్టిఫికెట్, వోటర్ ఐ.డి కార్డ్. ఆధార్ కార్డ్.ప్రాజెక్టుల వారీగా ఖాళీల పూర్తి వివరాలు జతపరచడం అయినది.ఈ నోటిఫికేషన్ పూర్తిగా రద్దు పరచటానికి గానీ, మార్పులు చేయడానికిగానీ జిల్లా కలెక్టర్ / చైర్మెన్ కామారెడ్డికి పూర్తి అధికారం కలదు. ఆన్లైన్‌లో అప్లై చేయకుండా మాన్యువల్ దరఖస్తులు సి.డి.పి.ఓ/ప్రజావాణిలో సమర్పించిన దరఖస్తులు పరిగణనలోకి తీసకోబడవు.

---

## బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ జన్మదిన వేడుకలు - సేవా కార్యక్రమం

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 08, (జన సంఘర్షణ):




బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ జన్మదిన సందర్భంగా వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కూకట్పల్లి నియోజకవర్గం కో- ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగనాథ్ సమక్షంలో సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు అవసరమైన వంట సామాగ్రిని, అలాగే విద్యార్థులకు ఉపయోగపడే తినే ప్లేట్లు, గ్లాసులను అశ్వంత్ కుమార్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, ' గిఫ్ట్ ఏ స్మైల్ ' కార్యక్రమం ద్వారా ప్రభావితమై ఈ సేవా కార్యక్రమం చేపట్టడం జరిగింది. పిల్లల ముఖాల్లో చిరునవ్వు చూడడమే మాకు అసలైన పుట్టినరోజు కానుక" అని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యతో పాటు మౌలిక వసతులు కూడా అవసరమని, భవిష్యత్ లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, మాచర్ల భద్రయ్య సత్యనారాయణ, లక్ష్మీనరసయ్య, సోమేష్ సాయి, రమేష్, రమణ, నరేందర్, ప్రసాద్, మారుతి, ప్రసాద్, రాకేష్, రాజు అనిల్, దీపు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---


## కరాటే నగేష్ కుటుంబని పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 8 (జన సంఘర్షణ )



కరాటే శిక్షకుడు నగేష్ తండ్రి మల్లూరు శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్పరామర్శించారు. ఈ సందర్భంగా నగేష్ నివాసానికి వెళ్లిన నరేష్ గౌడ్, శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుమారులు కరాటే నగేష్, జగదీష్ లను ఓదార్చి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కో-ఆప్షన్ సభ్యుడు తాహెర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ ఒమర్ మొహియుద్దీన్, మహ్మద్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి...



భారత దేశ ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నింపాలని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ప్రజలకు సూచించారు. మెదక్ పట్టణంలోని ఆజంపుర ప్రాంతంలో 9వ, 26వ వార్డులకు సంబంధించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఒకే వ్యక్తి పేరు రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒకే చోట ఉండేలా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపాలని తెలిపారు. ఫారాల నింపడంలో లేదా ఓటరు జాబితాకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత బీఎల్‌వో (దీూా) లను సంప్రదించాలని, అవసరమైతే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాహెర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ ఫాజిల్, మహ్మద్ అంజద్, సయ్యద్ ఒమర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రధానం

- రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రత తప్పనిసరి.
- డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాలు-

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 8 (జన సంఘర్షణ)





మెదక్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు బుధవారం మెదక్ పట్టణంలోని పలు ఫుడ్ రెస్టారెంట్లు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్వాగత్, చంద్రభవన్, ప్యారడైజ్ మరికొన్ని హోటళ్ల వంటశాలలు, నిల్వ గదులు, శుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, సిబ్బంది పరిశుభ్రత, కిచెన్ హైజిన్ పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మున్సిపల్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. మెదక్ లోని అన్ని ఫుడ్ రెస్టారెంట్లు ప్రజలకు 100 శాతం ఆరోగ్యకరంగా ఉండాలి. కల్తీ, నాసిరకం ఆహారం ఏమాత్రం సహించేది లేదు. వారానికోసారి తనిఖీలు చేసి రిపోర్ట్ ఇవ్వాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి"బి అని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే గారు హోటల్ యజమానులతో మాట్లాడుతూ ప్రజలు మీపై నమ్మకంతో తింటున్నారు. వాళ్లకు అందించే ఆహారం నాణ్యంగా, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడం మీ బాధ్యత. ఏ ఒక్కరి ఆరోగ్యంతోనూ చెలగాటమాడొద్దు" అని కోరారు.

**ప్రజల హర్షం:**

ఎమ్మెల్యే స్వయంగా చెప్పడం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మా ఆరోగ్యం గురించి ఆలోచించే నాయకుడు మాకు ఉండడం మా అదృష్టం అని అన్నారు. డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మెదక్‌ను ఆరోగ్యకరమైన, సురక్షితమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అధికారులు హామీ ఇచ్చారు.

## స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...

పోతంగల్/. . జులై 8 /(జన సంఘర్షణ)



పోతంగల్ మండలంలోని చైతన్ నగర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కాంతా సునీల్, ఆధ్వర్యంలో ఆయుర్వేద్య సీనియర్ డాక్టర్ ప్రకాష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో నరాల నొప్పులు, నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పులు, ఉన్నవారికి వైద్యం చేశారు అదేవిధంగా సమస్యలు ఉన్నవారికి మూడు రోజులకు తగిన మందులు కూడా ఉచితంగా అందించారు. డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినటువంటి స్థానిక గ్రామ సర్పంచ్ కాంత సునీల్ మా యొక్క హాస్పటల్ నుండి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంత సునీల్, ఉప సర్పంచ్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీమ్ కోర్ట్ గ్రౌండ్స్ అఫ్ అరెస్ట్

- ఇకపై పోలీసులు ఎవర్ని అరెస్టు చేసినా...లిఖిత పూర్వకంగా కారణం తెలపాల్సిందే..! సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- అరెస్టు అయిన నిందితుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించే దిశగా దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలనాత్మక తీర్పును వెలువరించింది.

హైదరాబాద్/జూలై 8/(జన సంఘర్షణ)
ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం.. ఎలాంటి నేరం కింద అరెస్టు చేసినా సరే, ఎలాంటి మినహాయింపులు లేకుండా అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా, నిందితుడికి అర్థమయ్యే భాషలోనే తెలియజేయాలని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణం 22(1) ప్రకారం.. అరెస్టు చేసిన వ్యక్తికి అరెస్టు కారణాలు సాధ్యమైనంత త్వరగా తెలియజేయాలనే అంశాన్ని ఈ తీర్పు బలంగా సమర్థించింది. జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ 52 పేజీల తీర్పులో.. "ఇది ఏదో లాంఛనప్రాయంగా పాటించాల్సిన విధానం కాదు. ఇది పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక రక్షణ" అని స్పష్టం చేశారు. ముఖ్యంగా తనను ఎందుకు అరెస్టు చేశారో, తనపై మోపిన నేరారోపణల స్వభావం ఏమిటో నిందితుడికి తెలియాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ జ్ఞానం మాత్రమే నిందితుడు న్యాయ సహాయం కోసం ప్రయత్నించడానికి, తనపై వచ్చిన ఆరోపణలకు తగిన విధంగా ప్రతిస్పందించడానికి వీలు కల్పిస్తుంది. రిమాండ్‌కు 2 గంటల ముందు గడువు సాధారణంగా అరెస్టు సమయంలోనే లిఖితపూర్వక కారణాలు ఇవ్వడం తప్పనిసరి. అయితే ప్రత్యేక పరిస్థితుల కారణంగా అరెస్టు సమయంలో కారణాలు తెలియజేయడం సాధ్యం కాకపోతే.. వాటిని రిమాండ్ కోసం న్యాయమూర్తి ఎదుట నిందితుడిని హాజరు పరచడానికి కనీసం రెండు గంటల ముందుగానైనా లిఖిత పూర్వకంగా అందజేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ గడువును పాటించడంలో విఫలం అయితే.. ఆ అరెస్టును, నిందితుడి రిమాండ్‌ను చట్టవిరుద్ధ చర్యగా పరిగణించే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ తీర్పు ముంబయిలో 2024లో జరిగిన బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసులో నిందితుడు మిహిర్ రాజేశ్ షా దాఖలు చేసిన అప్పీలుపై



వెలువడింది. తన అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా ఇవ్వలేదనే కారణంపై షా తన అరెస్టు చట్టబద్ధతను సవాలు చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ చారిత్రక తీర్పు అమలు కోసం, దీని ప్రతులను అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లకు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది..వీ. దశరత్ కుమార్ ( అడ్వకేట్, సెల్ : 9553734207 పేర్కొన్నారు.

## కేపిహెచ్ బి 9వ ఫేస్‌లో ఘనంగా డా. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు

- నాయకుడు మరణించినా ప్రజల గుండెల్లో జీవించి ఉండటానికి నిలువెత్తు సాక్ష్యం వైయస్ఆర్: కరుమూరి వెంకట్ రెడ్డి
- వైయస్ రాజశేఖర్ రెడ్డి ఒక బ్రాండ్: కొండ రాజీవ్

హైదరాబాద్ సిటీ, కూకట్ పల్లి ప్రతినిధి అంజిబాబు,జూలై 08, (జన సంఘర్షణ):
తెలుగునాట రాజకీయాలు ఉన్నంత కాలం వైయస్ఆర్ ముద్ర సజీవంగా ఉంటుందని, నాయకుడు మరణించినా.. ప్రజల గుండెల్లో జీవించి ఉండటానికి నిలువెత్తు సాక్ష్యం వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వై ఎస్ ఆర్ సి పి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కరుమూరి వెంకట్ రెడ్డి అని అన్నారు. కూకట్పల్లి కెపిహెచ్బి కాలనీ, 9వ ఫేస్ వద్ద వైయస్సార్ అభిమానులు సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ భాష, శ్రీకాంత్ రెడ్డి, అరుణ రెడ్డి, లక్ష్మీరెడ్డి లు ఏర్పాటు చేసిన 77వ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కరుమూరి వెంకటరెడ్డి, అఫీషియల్ స్పోక్స్ పర్సన్ కొండ రాజీవ్, కడప జిల్లా ఉపాధ్యక్షులు డివి శశికాంత్ రెడ్డి, స్థానిక వైయస్సార్ అభిమానులతో కలిసి డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి పూలు మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జై వైయస్సార్ జై జై వైఎస్ఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులకు సూర్య ఉదయం తెలంగాణ ఎడిటర్ భాష, హాస్టల్ అసోసియేషన్ సభ్యులు అరుణ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా కరుమూరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ పేద ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత. ఈరోజు పార్టీలకు అతీతంగా వైయస్సార్ అభిమానులుగా ఎంతోమంది నాయకులు ఆయనకు నివాళులు అర్పిస్తూ ఆయనను గుర్తు చేసుకుంటున్నారు. ఎన్నేళ్లు బతికామని కాదు ప్రజలకు ఎంత మంచి పనులు చేశాము అన్నదే ముఖ్యమంటూ ఒక సరికొత్త అధ్యయనం సృష్టించారు. వైయస్సార్ పేద ప్రజలకు సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారు 108, 104, ఆరోగ్యశ్రీ డ్వాక్రా రుణమాఫీ, రైతులకు ఉచిత విద్యుత్తు, రైతుల రుణమాఫీ, ఫీజు రియంబర్స్మెంట్ ఇలా చెప్పుకుంటూ



పోతే మరెన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అనడంలో అతిశయోక్తి లేదన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన అన్నారు. అనంతరం అఫీషియల్ స్పోక్స్ పర్సన్ కొండ రాజీవ్ మాట్లాడుతూ కుకట్పల్లి గడ్డ వైయస్సార్ అడ్డా అన్న రీతిలో జయంతి వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉన్నాను. ఆయన పాలనకు ఆయన చేసిన మంచికి ప్రజల గుండెల్లో వైయస్సార్ దేవుడు లా ఉన్నాడు అని చెప్పడానికి నిదర్శనంగా ఇక్కడ కుల మతాలకు, పార్టీలకు అతీతంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు అందరూ ముందుకు వచ్చి జోహార్ వైయస్ఆర్ అంటూ జయంతి వేడుకలు చేశారు. వారందరికీ కృతజ్ఞతలు. వైఎస్ఆర్ అంటే ఒక బ్రాండ్ అని ఆయన మన మధ్య లేకున్నా కానీ ఆయనపై మనకున్న ప్రేమ అనేది చావలేదు ఆయన ఆశయాలు మనం అందరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం కెపిహెచ్బి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్ గౌడ్ లు పాల్గొని వైయస్సార్ కు నివాళులర్పించారు. అనంతరం బండి మధుసూదన్ రెడ్డి శివారెడ్డి, ఉపేందర్ రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి గురించి, పాలన గురించి నేటికీ ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటారు. ఆయన ఏ కార్యక్రమం తలపెట్టినా పేదలకు ఉపయోగపడాలనే తాపత్రయం ఉండేది. వైయస్ఆర్ చేసిన మంచిని ప్రజలు ఏ రోజూ మర్చిపోలేరు అని అన్నారు. సూర్య ఉదయం పత్రిక తెలంగాణ ఎడిటర్ భాష మాట్లాడుతూ పేదల సంక్షేమానికి, రైతుల అభ్యున్నతికి, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, రాష్ట్రాలకు సాగునీటి ప్రాజెక్టులు ఇంకా అనేక రంగాల్లో మహానేత వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల కోసం ఆలోచించిన నాయకుడిగా, ప్రజల హృదయాల్లో నిలిచిన మహానేతగా వైఎస్సార్ ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని అన్నారు. అనంతరం వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న వితరణ చేశారు. ఈ జయంతి వేడుకల్లో వైయస్సార్ అభిమానులు గాలి రెడ్డి, తులసి రెడ్డి, సాయినాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్నారెడ్డి, ఆది రెడ్డి, రమణ రెడ్డి, కొండల్ రావు, స్థానిక విలేకరులు శ్యాంసుందర్, క్రాంతికుమార్, సోమిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సునీల్ కుమార్, చందు, కాలనీ వాసులు, వైయస్సార్ అభిమానులు, వైయస్ జగన్ అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ సర్కిల్ శానిటేషన్ నిర్వహణపై అసంతృప్తి

హైదరాబాద్/జూలై 8/(జన సంఘర్షణ)
బోడుప్పల్‌లో బుధవారం కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, పౌర సదుపాయాలపై క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. పరిశుభ్రమైన కాలనీల నిర్మాణం, పచ్చదనం పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మల్కాజ్గరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బుద్ధనగర్ ప్రాంతంలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, పౌర సదుపాయాలపై క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధనగర్ ప్రధాన రహదారిని పరిశీలించిన కమిషనర్, పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, ఇంటింటా చెత్త సేకరణ సకాలంలో జరగకపోవడం, స్వీపింగ్ ద్వారా సేకరించిన వ్యర్థాలు రహదారులపై ఉండడం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, ప్రతిరోజూ క్రమబద్ధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింటా చెత్త సేకరణను నిర్దేశిత సమయానికి పూర్తి చేయడంతో పాటు, స్వీపింగ్



ద్వారా సేకరించిన వ్యర్థాలను రహదారులపై వదిలిపెట్టకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే అనంతరం బుద్ధనగర్ కాలనీ రోడ్ నెం.4లో పట్టణ హరితీకరణ కార్యక్రమాలను పరిశీలించిన కమిషనర్, అర్బన్ బయోడైవర్సిటీ (యూబీడీ) విభాగం పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్సను సక్రమంగా సంరక్షించేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, కలుపుఅనంతరం బుద్ధనగర్ కాలనీ రోడ్ నెం.4లో పట్టణ హరితీకరణ కార్యక్రమాలను పరిశీలించిన కమిషనర్, అర్బన్ బయోడైవర్సిటీ (యూబీడీ) విభాగం పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్సను సక్రమంగా సంరక్షించేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, కలుపు మొక్కలను తొలగించడం, కొమ్మల కత్తిరింపు, మొక్కల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఇంటింటా చెత్త సేకరణ నిర్వహించే శానిటేషన్ సిబ్బంది ప్లాంటర్ బాక్సలో ప్లాస్టిక్ లేదా ఇతర వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్లాంటర్ బాక్సను నిరంతరం పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పరిశుభ్రమైన, పచ్చదనం నిండిన కాలనీల నిర్మాణం కేవలం మున్సిపల్ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మొక్కలను సంరక్షిస్తేనే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందరికీ అందించగలమని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. అధికారులు, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని ఆయన ఆదేశించారు.

## ఆంధ్ర-తెలంగాణ రాధా-రంగా మిత్రమండలి ధర్మ సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నారాయణ జయప్రకాశ్ నియామకం

హైదరాబాద్ సిటీ,శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు , జూలై 08, (జన సంఘర్షణ):



ఆంధ్ర-తెలంగాణ రాధా-రంగా మిత్రమండలి ధర్మ సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన సంస్థ వ్యవస్థాపకులు పన్నాస పూర్ణచంద్రరావు (కాళ్లపాలెం బుజ్జి)కు నారాయణ జయప్రకాశ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రంగా అభిమానుల సేవలో అంకితభావంతో పనిచేస్తానని, సంస్థ అభివృద్ధికి తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆర్కెపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ప్రజలకు, రంగా అభిమానులకు మరింత సేవ చేయాలని ఆర్కెపూడి గాంధీ సూచిస్తూ ఆశీర్వదించారు. అలాగే భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును కలిసి ఆయన ఆశీర్వాదాలు కూడా పొందారు. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు, అభిమానులకు ఎల్లప్పుడూ సేవ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ కోశాధికారి రొక్కం శంకర్, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు ద్రాక్ష వేణి, తెలంగాణ కార్యదర్శి దామెర్ల రామచంద్ర, శేరిలింగంపల్లి అధ్యక్షుడు సురేష్, నాగరాజన్, జిల్లెల దేవరాజులు, పార్థసారథి, రంగా అభిమానులు అల్లూరి రామ్ రాజ్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్ రావు, సాయి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నారాయణ జయప్రకాశ్ సంస్థ అభివృద్ధికి, ప్రజా సేవకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని మరోసారి పునరుద్ఘాటించారు.

## గొంతుపై గాయాలు.. నలుగురిపై కేసు

మోపాల్ /జులై 8/(జన సంఘర్షణ




మోపాల్ పీఎస్ పరిధిలోని కొక్యానాయక్ తండాలో బానోతు హరి(50) మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుని గొంతుపై గాయాలు ఉండటంతో అతని సోదరుడు బానోతు పవన్ కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుని భార్య మీరిబాయి, కుమారుడు సురేశ్, కోడలు రజిత, ఆమె తమ్ముడు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎ× సుష్మిత చెప్పారు. మృతుడు మద్యం మత్తులో గొడవ పడిన తర్వాత మరణించాడని ప్రాథమికంగా తెలిసిందన్నారు.

## జోహార్ వైఎస్సార్! కలికోట శంకర్ కైతలాపూర్ డివిజన్‌లో ఘనంగా డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు!

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 08, (జన సంఘర్షణ):




బుధవారం కూకట్పల్లి నియోజికవర్గం ఆంజనేయ నగర్ సర్కిల్‌లో కైతలాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్సార్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కేక్ కట్ చేసి, వైఎస్సార్ ఆశయాలను కొనియాడారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని నిరుపేదలకు, మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకి చీరల పంపిణీ చేయడం జరిగింది. ప్రజల కోసం నిరంతరం శ్రమించే పరిశుద్ధ కార్మికులకి గౌరవించుకోవడం సంతోషకరమని శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

## బాధ పడకండి, నేనున్నా.. నిరంజన్ ఫ్యామిలీకి సోనూ భరోసా

హైదరాబాద్/జూలై 8/(జన సంఘర్షణ)





పవన్ కళ్యాణ్ అభిమాని నిరంజన్ మృతి విషయం తెలిసి నటుడు సోనూ సూద్ అతడి కుటుంబసభ్యులతో వీడియో కాల్లో మాట్లాడారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలన్నారు. అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. కాగా గత నెల సోనూ సూద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరంజన్ను పరామర్శించారు. కొత్త డ్రెస్సులు, బహుమతులు ఇచ్చి ధైర్యం చెప్పారు.

## రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కినా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సూపరింటెండెంట్



మహబూబ్‌నగర్,/ జూలై 8 /(జన సంఘర్షణ)
మహబూబ్‌నగర్ జిల్లా సహాయ సంచాలకుడు (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బొమ్మిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి రూ.15 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. కర్వేన గ్రామానికి సంబంధించిన గ్రామ మ్యాప్‌లో సవరణలు చేపట్టేందుకు ఫైల్‌ను సహాయ సంచాలకుడి వద్దకు పంపించి అధికారిక అనుకూలత కల్పించేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.15 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు అతడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ వెల్లడించింది. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచించారు.

## కమిషనర్కు తెలుసా.. కాపాడేస్తున్నారా?

- కలెక్టర్ నివేదిక పక్కనబెట్టి.. అవినీతి 'టి.ఎ.'కు మళ్లీ పోస్టింగ్!
- పౌరసరఫరాల కేంద్ర కార్యాలయంలో 'కీలక' అధికారి చక్రం!
- అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్కు ఈ విషయం తెలుసా? లేక నివేదికను మధ్యలోనే నొక్కేశారా?
- కలెక్టర్ల ఉత్తర్వులకే దిక్కు లేకపోతే క్షేత్రస్థాయిలో ఇక వ్యవస్థ ఎవరి కంట్రోల్లో ఉన్నట్లు?

వరంగల్ ప్రతినిధి, జులై 8/(జన సంఘర్షణ)




వరంగల్ పేదల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం కొంతమంది టి ఏ ల వల్ల అభాసుపాలవుతోంది. కాసులకు కక్కుర్తిపడి, కొంతమంది మిల్లర్ లు తెచ్చే నాణ్యత లేని, పుచ్చు పట్టిన, రంగు మారిన బియ్యాన్ని గోదాముల్లోకి అనుమతిస్తున్నారు. సరిగ్గా ఇదే రీతిలో గతేడాది వరంగల్ జిల్లాలో కలెక్టర్ తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయి, సరెండర్ అయిన ఓ టెక్నికల్ అసిస్టెంట్ (టి.ఎ.) వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖలో పెను సంచలనంగా మారింది. అదనపు కలెక్టర్ స్థాయి అధికారి సదరు టి.ఏ పై క్రమశిక్షణా చర్యల కోసం పంపిన నివేదిక.. హైదరాబాద్లోని కేంద్ర కార్యాలయంలో ఓ 'కీలక' అధికారి అండదండలతో మాయమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తప్పు చేసి ఏడాది తిరక్కుండానే సదరు 'కిలాడీ' ఉద్యోగి పక్కజిల్లా అయినటువంటి భూపాలపల్లి లో మళ్లీ పోస్టింగ్ దక్కించుకోవడం వెనుక పెద్ద నెట్వర్కే నడిచినట్లు తెలుస్తోంది.

**ఆకస్మిక తనిఖీ.. గుట్టురట్టు!**

గత ఏడాది వరంగల్ జిల్లాలోని చలపర్తి 'ఎస్.డబ్ల్యూ.సి' (రాఔజ) గోదాముకు రాధాకృష్ణ, గోపీకృష్ణ అగ్రో ఇండస్ట్రీస్ సంస్థలు సరఫరా చేసిన 10శాతం సన్నబియ్యం నిల్వలను జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనీస నాణ్యత లేని, పుచ్చుపట్టిన బియ్యాన్ని గోదాముల్లోకి యథేచ్ఛగా అనుమతిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించిన వరంగల్ జిల్లా కలెక్టర్, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. దీంతో క్వాలిటీ కంట్రోల్ (ఉజ) మేనేజర్, దుగ్గొండి తహసీల్దార్, నర్సంపేట ఆర్.డీ.ఓలతో కూడిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం రంగంలోకి దిగి 11 బియ్యం నమూనాలను క్షుణ్ణంగా పరీక్షించింది.

**మచ్చు చూస్తే.. అంతా మోసమే!..**

ఈ తనిఖీల్లో ల్యాబ్ నివేదికలు చూసి అధికారులే షాక్కు గురయ్యారు. ఏసికే నంబర్లు 10418, 11265, 9061 ల కింద సేకరించిన బియ్యంలో దెబ్బతిన్న గింజలు, రంగు మారిన గింజలు ప్రభుత్వం నిర్దేశించిన రిజెక్షన్ పరిమితిని మించి ఉన్నట్లు తేలింది. రైస్ మిల్లర్లతో కుమ్మక్కై, లాభాల కోసం నాసిరకం బియ్యాన్ని పాస్ చేసినట్లు నిర్ధారణ కావడంతో, సదరు టెక్నికల్ అసిస్టెంట్ (టి ఏ) డి. అరవింద్పై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వరంగల్ అదనపు కలెక్టర్ కార్యాలయం నుంచి హైదరాబాద్లోని పౌరసరఫరాల సంస్థ వీసీ ఒ మేనేజింగ్ డైరెక్టర్కు పూర్తి ఆధారాలతో ఫైలు పంపారు. నిబంధనల ప్రకారం అప్పటి వరంగల్ జిల్లా మేనేజర్ ఆ 'టి.ఎ.'ను హెడ్ ఆఫీస్ కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

**కమిషనరు తెలవకుండానే కథ నడిపారా?**

జిల్లా అత్యున్నత అధికార యంత్రాంగం అవినీతిని ఆధారాలతో సహా నిరూపించి యాక్షన్ కోసం ఫైలు పంపితే, దానికి కేంద్ర కార్యాలయంలోని ఓ 'సరికొత్త' పెద్ద దిక్కు రక్షణ కవచంలా నిలిచారనే ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్ల లేఖలకే దిక్కు లేకపోతే ఇక క్షేత్రస్థాయిలో నిజాయితీగా పని చేసే అధికారులకు రక్షణ ఎక్కడని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. పౌరసరఫరాల శాఖలో అవినీతిని కూకటివేళ్లతో పెకిలిస్తున్న సివిల్ సప్లై కమిషనర్ దృష్టికి ఈ వ్యవహారం అసలు వెళ్లిందా? లేదా సదరు కీలక అధికారే ఫైలును గాల్లో కలిపేశారా? అన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.

**పాపం పండకముందే.. మళ్లీ 'పీఠం'!**

ఉండటం శాఖాపరమైన చర్యలకు గురికావాల్సిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి 'టి.ఎ.' అరవింద్ ఏడాది తిరగకముందే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మళ్లీ పోస్టింగ్ సాధించడం పౌరసరఫరాల వర్గాలను ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. కేంద్ర కార్యాలయంలోని ఆ కీలక అధికారి ఆశీస్సులు వల్లే ఇదంతా సాధ్యమైందని తోటి ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. ఒకవేళ ఈ బాగోతం కనుక కమిషనర్ టేబుల్ పైకి వెళ్తే సదరు 'టి.ఎ.'తో పాటు, అతడిని వెనకేసుకొస్తున్న సదరు 'కీలక ' అధికారికి పై కుడా చర్యలు ఉండే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి దీనిపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటారో చూడాలి!

# ఇసుక మాఫియా హల్చల్

- పోలీసులపై దాడి చేసిన ఆరుగురిపై కేసులు, ముగ్గురి అరెస్ట్

కరీంనగర్/జూలై 8/(జన సంఘర్షణ)
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి చెక్పోస్ట్ వద్ద మానేరు ఇసుక క్వారీల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుకున్న పోలీసులపై దాడి చేసిన విలాసాగర్ గ్రామానికి చెందిన ఆరుగురిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేశారు. హుజురాబాద్ ఏసిపి మాధవి అరెస్ట్ అయిన ముగ్గురిని చూపించి ఘటన వివరాలు వెల్లడించారు. చెకోపోస్ట్ వద్ద ఇసుక ట్రాక్టర్లను పంపాలని వారు వాగ్వివాదానికి దిగడమే కాకుండా, దాడికి యత్నించి ఘర్షణ వాతావరణం సృష్టించినట్లు ఆమె తెలిపారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఈ ఘటనను వీడియో తీయడంతో ఆగ్రహించిన ఆరుగురు వ్యక్తులు అతనిపై దాడి చేసి బైక్ను ఎత్తుకెళ్లారు. చెక్పోస్ట్ వద్ద ఉన్న సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, వెంటనే ఎస్సై అక్కడికి చేరుకున్నారు, అయితే నిందితులు పారిపోయారని ఏసిపి వివరించారు. ఆరుగురు వ్యకులపై చెక్పోస్ సిబ్బంది విధులకు హుజురాబాద్ ఏసిపి మాధవి అరెస్ట్ అయిన ముగ్గురిని చూపించి ఘటన వివరాలు వెల్లడించారు. చెకోపోస్ట్ వద్ద ఇసుక ట్రాక్టర్లను పంపాలని వారు వాగ్వివాదానికి దిగడమే కాకుండా, దాడికి యత్నించి ఘర్షణ వాతావరణం సృష్టించినట్లు ఆమె తెలిపారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఈ ఘటనను వీడియో తీయడంతో ఆగ్రహించిన ఆరుగురు వ్యక్తులు అతనిపై దాడి చేసి బైక్ను ఎత్తుకెళ్లారు. చెకోపోస్ట్ వద్ద ఉన్న సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, వెంటనే ఎస్సై అక్కడికి చేరుకున్నారు, అయితే నిందితులు పారిపోయారని ఏసిపి వివరించారు. ఆరుగురు వ్యక్తులపై చెక్పోస్ట్ సిబ్బంది విధులకు





ఆటంకం కలిగించిన కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఏసిపి మాధవి పేర్కొన్నారు. ఆ ఆరుగురిపై గతంలో కూడా క్రిమినల్ కేసులు ఉన్నందున రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని ఆమె హెచ్చరించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ రెండు సార్లు పట్టుబడితే వారి వావాలను జప్తు చేస్తామని ఏసిపి మాధవి స్పష్టం చేశారు.

# పేదల ఆరోగ్యానికి బర్ల మధుకర్ అభయహస్తం...

- స్టార్ హాస్పిటల్ సహకారంతో రాంపూర్ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు.....
- మండలంలోని అని గ్రామాలకు వైద్య సేవలే లక్ష్యం.....

కోటగిరి, /జూలై 8/:(జన సంఘర్షణ)
పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలనే సంకల్పంతో కోటగిరి గ్రామ సర్పంచ్, సర్పంచ్ పోరం అధ్యక్షుడు, అభయ హస్తం సొసైటీ డైరెక్టర్ బర్ల మధుకర్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు మండలంలో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందలేని నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాంపూర్ గ్రామంలో స్టార్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో భారీ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాదిమంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స సూచనలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను వారి గ్రామాలకే తీసుకురావాలని ఉద్దేశంతో అభయ హస్తం సొసైటీ ఆధ్వర్యంలోవరుసగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బర్ల మధుకర్ తెలిపారు. కోటగిరి మండలంలోని ఒక్క గ్రామం కూడా మిగలకుండా దశలవారీగా అన్ని గ్రామాల్లో స్టార్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. పేదల ఆరోగ్యమే తనకు అత్యంత ప్రాధాన్యమని, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని చెప్పారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ సర్పంచ్ సామ్మీబాయి శంకర్‌కి బర్ల మధుకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు బర్ల మధుకర్ సేవా భావాన్ని



అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ వైద్యులు బాలగంగాధర్, ఇర్ఫానుద్దీన్, గణేష్, అఖిల్, నర్సింగ్ స్టాప్ పద్మ, అరవింద, నందకుమార్, ఎక్బాల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బోధన్ డివిజన్‌లో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

- పండుగల బందోబస్తు, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య
- పాత నేరస్థులపై నిఘా.... డ్రగ్స్-గుట్కా-పేకాటపై నిర్విరామ దాడులు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ...

బోధన్/ జూలై 8/(జన సంఘర్షణ)
రాబోయే పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బోధన్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన బోధన్ డివిజన్ పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో కమిషనర్ పెండింగ్ కేసుల పురోగతి, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ చర్యలను సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో ఏసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాబోయే పండుగల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, 24 గంటలపాటు వాహనాల తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, పేకాట, గుట్కా అక్రమ వ్యాపారాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను వేగంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా బలోపేతం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టం చేయాలని సూచించారు.బోధన్ డివిజన్ మహారాష్ట్ర సరిహద్దుకు




ఆనుకుని ఉండటంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మహారాష్ట్ర పోలీసులతో సమన్వయం పెంచుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.



విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆన్‌లైన్ మోసాల బాధితులకు వెంటనే సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దాడులు కొనసాగిస్తూ, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పేకాట, గుట్కా, అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర దాడులు కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, లింక్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, రోడ్లకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించాలని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం, ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. అలాగే రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, బోధన్, బోధన్ రూరల్, రుద్రూర్, ఎడపల్లి, రెంజల్, వర్ని, కోటగిరి పోలీస్ స్టేషన్ల అధికారులు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co